# సాక్షి సూర్యాపేట

శనివారం ၊ 1 ၊ జూలై ၊ 2023

I




**పేదల వైద్యుడు.. రంగన్న**

డాక్టర్ రంగారెడ్డి 40ఏళ్లుగా సూర్యాపేట ప్రజలకు ఆదిత్య క్లినిక్ పేరిట రూ.20లకే వైద్య సేవలందిస్తున్నారు. - IIలో



**పనులు పూర్తి చేయాలి**

ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు – మన బడి పనులు త్వరగా పూర్తి చేయాలని డీఈఓ అశోక్ అన్నారు. - IIలో




**వాతావరణం**

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### బదిలీలు సర్వసాధారణం



అదనపు న్యాయమూర్తిని సన్మానిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి తదితరులు

చివ్వెంల (సూర్యాపేట): న్యాయమూర్తులకు బదిలీలు సర్వసాధారణమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ అన్నారు. శుక్రవారం పదోన్నతిపై గద్వాల జిల్లాకు ప్రధాన న్యాయమూర్తిగా వెళ్తున్న జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి కుశకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. రెండు నెలల క్రితం బదిలీపై ఇక్కడకు వచ్చి, పదోన్నతి పొందడం అభినందనీయమని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



పొడి దుక్కిలో వరి విత్తనాలు నాటే ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

చివ్వెంల(సూర్యాపేట): రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. శుక్రవారం చివ్వెంల మండల పరిధిలోని జి.తిర్మలగిరి గ్రామంలో రెడ్డీస్ ల్యాబ్ అందించిన సీడ్ కమ్ ఫెర్టి డ్రిల్ యంత్రంతో రైతు పందిరి లింగారెడ్డి పొడి దుక్కిలో చేపట్టిన వరి విత్తనాలు నాటే ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. నీటి వసతి తక్కువగా ఉన్నా పంట చేతికి వస్తుందని, నాటు వేసేందుకు కూలీల ఖర్చు తక్కువ ఉంటుందన్నారు. బురదలో దుక్కి చదును చేయాల్సిన అవసరం ఉండదని, ఎరువుల వినియోగం కూడా తక్కువగా ఉంటుందన్నారు. చీడ పీడల సమస్య కూడా తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ఆశాకుమారి, ఏఈఓ అనూష, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు – 2023 ఎంపికకు ఆన్‌లైన్ ద్వారా 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హత గల ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కోసం తమ ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు.

### ఐఈఆర్‌టీ పోస్టుల మెరిట్ లిస్టు విడుదల

సూర్యాపేటటౌన్: పాఠశాల విద్యాశాఖలో సమగ్ర శిక్షా అభియాన్ కింద కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసేందుకు గతంలో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ లిస్టును విడుదల చేసినట్లు డీఈఓ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, 12 ఐఈఆర్‌టీ పోస్టులకు అనుమతి వచ్చిందని, దీనికి సంబంధించిన మెరిట్ లిస్టును డీఈఓ కార్యాలయ నోటీస్ బోర్డులో, డీఈఓ బ్లాగ్ స్పాట్‌లో పెట్టినట్లు తెలిపారు. మండలాల్లోని ఎమ్మార్సీ కేంద్రాల్లోనూ లిస్టు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.


### మట్టపల్లిలో విశేష పూజలు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు విశేషంగా జరిపించారు. ఆలయంలో సుప్రభాతసేవతోపాటు, శ్రీస్వామివారికి కృష్ణానది నుంచి బిందెతీర్థం తెచ్చి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చన చేపట్టారు. అదేవిధంగా ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి, నిత్యకల్యాణం, ఎదుర్కోళ్ల మహోత్సవం జరిపించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగల్య ధారణ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అధికార పార్టీలో అసంతృప్తులు

**బీఆర్‌ఎస్ పార్టీలో అప్పుడే టికెట్ల లొల్లి**

- ఒక్కొక్కరుగా బయటపడుతున్న నేతలు
- ఇటీవల చకిలం... ఇప్పుడు సామేలు
- అంతర్గతంగా అసంతృప్తితో మరికొందరు..
- పార్టీలో ఉంటూ పోటాపోటీగా కార్యక్రమాలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్‌ఎస్ పార్టీలో అసంతృప్తి నాయకులు పెరుగుతున్నారు. నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. ఇటీవల చకిలం అనిల్‌కుమార్ పార్టీని వీడగా.. ఇప్పుడు తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన మందుల సామేలు రాజీనామా చేశారు. ఇదే నియోజకవర్గానికి చెందిన ఓ జెడ్పీటీసీ, మరికొంత మంది నాయకులు కూడా పార్టీ మారేందుకు సిద్ధం అయ్యారు. మరికొందరు అంతర్గతంగా తేల్చుకునేందుకు రెడీ అవుతున్నారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే టికెట్ల కోసం పోటీ పెరుగుతోంది. ఇటు అసంతృప్తులు అటు ఆశావహులతో బీఆర్‌ఎస్ అధిష్టానం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో పార్టీలో కీలకగా పనిచేసిన నేతలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక తమను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వారిలో కొందరికి కార్పొరేషన్ తదితర పదవులను ఇచ్చి సంతృప్తి పరిచినా మరికొందరు ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆశతోనే ఉన్నారు. అలా మందుల సామేలు లాంటి కొందరు పార్టీని వీడుతున్నారు. కొందరు సీఎం కేసీఆర్‌పై భారం వేసి, ఎదురుచూస్తున్నారు.

**ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో విధంగా..**

- **నల్లగొండ** నియోజకవర్గానికి చెందిన చకిలం అనిల్‌కుమార్ తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీలో ఉన్నారు. తెలంగాణ రాకముందు ఆయన నల్లగొండ నుంచి పోటీ చేయాలనుకున్నారు. 2009లో పొత్తుల్లో భాగంగా టికెట్ కాంగ్రెస్‌కు పోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన దుబ్బాక నర్సింహారెడ్డికి టికెట్ ఇచ్చారు. రెండోసారి తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన కంచర్ల భూపాల్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. దీంతో చకిలంకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. అయితే హామీ నెరవేరలేదు. దీంతో ఆయన ఇటీవల తాను బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. మరోవైపు నియోజక వర్గంలో బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశిస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ఉద్యమంలో పాల్గొన్న చాడ కిషన్‌రెడ్డి ప్రతిసారి అడుగుతున్నా ఇవ్వడం లేదు. మరోవైపు పిల్లి రామరాజు సేవా కార్యక్రమాలతో నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు.
- **కోదాడ** నియోజకవర్గంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కన్నంతరెడ్డి శశిధర్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. గత ఎన్నికల్లో టికెట్ వస్తుందనుకున్నా చివరి నిమిషంలో తెలుగుదేశం నుంచి వచ్చిన బొల్లం మల్లయ్యయాదవ్‌కు టికెట్ దక్కింది. ఆ తర్వాత శశిధర్‌రెడ్డికి ఎలాంటి పదవులూ దక్కలేదు. ఈసారి ఆయన టికెట్ కచ్చితంగా వస్తుందని భావిస్తున్నారు. ఇక్కడ టికెట్ ఆశిస్తున్న వారిలో ఎన్‌ఆర్‌ఐ జలగం సుధీర్ కూడా ఉన్నారు.

- **తుంగతుర్తి** నియోజకవర్గానికి చెందిన మందుల సామేలు కూడా తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి పాల్గొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో గాదరి కిషోర్‌కుమార్‌కు కేసీఆర్ టికెట్ ఇచ్చారు. సామేలుకు కార్పొరేషన్ పదవి ఇచ్చినా, ఎమ్మెల్యే కావాలన్న కోరికతో టికెట్ అడుతున్నారు. తిరుమలగిరిలో గురువారం జరిగిన ప్రగతి నివేదన సభలో కిషోర్‌ను మూడోసారి గెలిపించాలని కేటీఆర్ ప్రకటించడతో తనకు ఇక టికెట్ రాదని భావించి సామేలు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు.

- సూర్యాపేటలో పార్టీ శ్రేణులంతా మంత్రి జగదీష్‌రెడ్డికే మద్దతు పలుకుతున్నారు. టికెట్ ఆశించేవారు ఎవరూ లేరు. హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే సైదిరెడ్డిపై అసంతృప్తి ఉన్నప్పటికీ అక్కడ బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశించేవారు పెద్దగాలేరు. ఆలేరు నియోజకవర్గంలోని అదే పరిస్థితి ఉంది. ప్రస్తుత ఎమ్మెల్యేకు టికెట్ వచ్చే అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బూడిద భిక్షమయ్య గౌడ్ బీఆర్‌ఎస్‌లో చేరారు. అధిష్టానం ఆయన విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నది తేలాల్సి ఉంది. భువనగిరి నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని కాదని, టికెట్ ఆశించేవారు ఇప్పటివరకు బయటకు రాలేదు.

- **నాగార్జునసాగర్** నియోజకవర్గంలో ప్రస్తుతం ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గాల మధ్య వర్గపోరు నడుస్తోంది. ఈసారి ఎన్నికల్లో టికెట్ ఎవరికి ఇచ్చినా మరొకరు సహకరించే పరిస్థితి లేదు. మరోవైపు నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో మాజీ ఎమ్మెల్సీ తేర చిన్నపరెడ్డి, మన్నెం రంజిత్ యాదవ్, కట్టెబోయిన గురువయ్య యాదవ్ ఉన్నారు.
- **దేవరకొండ** నియోజకవర్గంలో ఎమ్మెల్యే రవీంద్ర కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వర్గీయుల మధ్య అభిప్రాయభేదాలు కొనసాగుతున్నాయి. బయటి విమర్శలు చేసుకోకపోయినా అవి అంతర్గంగా కొనసాగుతున్నాయి. ఇక్కడి నుంచి మాజీ మున్సిపల్ చైర్మన్ దేవేందర్ నాయక్ కూడా టికెట్ ఆశిస్తున్నారు.
- **నకిరేకల్** నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నేతలు రెండు గ్రూపులుగా విడిపోయాయి. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వీరేశం వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఎవరికివారే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిట్టింగులకే ఈసారి టికెట్ ఇస్తామని కేసీఆర్ చెప్పడంతో.. టికెట్ రాకపోతే వీరేశం పార్టీ నుంచి వెళ్లిపోతాడన్న చర్చ కూడా సాగుతోంది.
- **మునుగోడు** నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు కొనసాగుతున్నాయి. చాలా సందర్భాల్లో అవి బయటపడ్డాయి. ప్రస్తుత ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికితోపాటు మాజీ ఎమ్మెల్సీ కర్నెప్రభాకర్, గుత్తా అమిత్‌రెడ్డి, నారబోయిన రవి, కర్నాటి విద్యాసాగర్, కంచర్ల కృష్ణారెడ్డి టికెట్ ఆశిస్తున్నవారిలో ఉన్నారు.

## చర్చనీయాంశంగా.. సామేలు రాజీనామా



అర్వపల్లిలో తన రాజీనామాను ప్రకటిస్తున్న మందుల సామేలు

సాక్షి,యాదాద్రి : బీఆర్‌ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు పార్టీకి రాజీనామా చేయడం చర్చ నీయాంశమైంది. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన మందుల సామేల్ తెలంగాణ మలిదశ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచారు. ఉద్యమంలో కేసీఆర్ ఇచ్చిన ప్రతి కార్యక్రమంలో పాల్గొన్నారు. తన సొంత నియోజకవర్గమైన తుంగతుర్తి నుంచి ఎమ్మెల్యే టికెట్ ఆశించారు. అయితే, 2009లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న మందుల సామేల్‌కు టీఆర్‌ఎస్ నుంచి అవకాశం దక్కలేదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా టీడీపీతో టీఆర్‌ఎస్‌పొత్తు పెట్టుకుంది. తుంగతుర్తి సీటును టీడీపీకి కేటాయించడంతో మాజీ మంత్రి మోత్కుపల్లికి టికెట్ రాగా ఆయన విజయం సాధించారు. ఆ తర్వాత 2104లో తుంగతుర్తి టికెట్‌ను తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుని కోటాలో నల్లగొండకు చెందిన గాదరి కిషోర్‌కుమార్‌కు కేటాయించారు. దీంతో సామేలు ఆశలు గల్లంతయ్యాయి. అప్పుడు ఎన్నికల ప్రచార సభ కోసం తుంగతుర్తి నియోజకవర్గానికి వచ్చిన కేసీఆర్.. తెలంగాణ ఉద్యమకారుడైన సామేలుకు ఎమ్మెల్సీ టికెట్ ఇస్తానని ప్రకటించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ పదవి ఇచ్చారు. పదవీ కాలం పూర్తి అయిన తర్వాత కూడా మరో ఏడాది పొడిగించారు. అయితే, 2018 ఎన్నికల్లో తుంగతుర్తి టికెట్ మళ్లీ కిషోర్‌కే వచ్చింది. దీంతో మందుల సామేలు ఆశలు మరోసారి గల్లంతయ్యాయి. పలు మార్లు సీఎం కేసీఆర్‌ను కలిసి తనకు తుంగతుర్తి టికెట్‌కే టాయించాలని విజ్ఞప్తి చేశారు.

**ఇక టికెట్ రాదని భావించి..**

వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే గాదరి కిషోర్‌ను ముచ్చటగా మూడోసారి తుంగతుర్తి ప్రజలు గెలిపించాలని గురువారం తిరుమలగిరిలో జరిగిన ప్రగతి నివేదన సభలో కేటీఆర్ ప్రజలను కోరారు. తాను కోరుకుంటున్న ఎమ్మెల్యే టికెట్ వచ్చే ఎన్నికల్లో కూడా రాదని తేలిపోవడంతో సామేల్ రాజీనామా చేశారు. నియోజకవర్గంలో మెజార్టీ సామాజిక వర్గానికి చెందిన తనకు తీరని అన్యాయం జరిగిందని, ఎమ్మెల్యే కిషోర్ ఇసుక వ్యాపారంపై పలుమార్లు కేసీఆర్, కేటీఆర్ దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదని సామేలు శుక్రవారం అర్వపల్లిలో చెప్పారు. అభిమానులు, కార్యకర్తలతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని, వచ్చే ఎన్నికలో తుంగతుర్తిలో పోటీ చేస్తానని పేర్కొన్నారు.

## యువతలో క్రీడా నైపుణ్యం వెలికి తీయాలి



క్రీడాకారులతో మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

ఆత్మకూర్(ఎస్) (సూర్యాపేట): యువతలో క్రీడా నైపుణ్యం వెలికి తీయడానికి ప్రతి గ్రామంలో క్రీడా పోటీలు నిర్వహించాలని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. జీజేఆర్ కప్ క్రీడల్లో భాగంగా శుక్రవారం ఆత్మకూర్ మండల కేంద్రంలో జరిగిన క్రీడా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, అదేవిధంగా ప్రజల్లో ఐకమత్యం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్ క్రీడాకారులతో కాసేపు ముచ్చటించి, వాలీబాల్ ఆడారు. అదే విధంగా పాతర్లపహాడ్, ఏపూర్, నెమ్మికల్ గ్రామాల్లో మంత్రి కుమారుడు గుంటకండ్ల వేమన్‌రెడ్డి క్రీడలను పర్యవేక్షించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

### ఆ బడిలో 150 మంది చేరిక



150 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

కోదాడఅర్బన్: కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మొత్తం 500 మంది విద్యార్థులు ఉండగా ఈ విద్యా సంవత్సరం అదనంగా 150 మంది చేరారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో విద్యార్థులు 150 ఆకారంలో కూర్చున్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మన ఊరు– మన బస్తీ కింద అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతోందని, ప్రధాన మంత్రి రైజింగ్ స్కూల్స్ కింద ఈ పాఠశాల సెలెక్ట్ అయిందని తెలిపారు.

## నేడు గ్రూప్- 4 పరీక్ష



సూర్యాపేటలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది



హుజూర్‌నగర్‌లో ఇన్విజిలేటర్లకు అవగాహన కల్పిస్తున్న సిట్టింగ్ స్క్వాడ్

- జిల్లాలో 97 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 30,315 మంది అభ్యర్థులు
- 15 నిమిషాలు ముందే కేంద్రాల గేట్ల మూసివేత

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్- 4 పరీక్షకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం జరగనున్న పరీక్షకు చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్ల నియామకం పూర్తి చేశారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 9.45 గంటల తరువాత, మధ్యాహ్నం 2.15 తరువాత పరీక్షా కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతిలేదని, అభ్యర్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

**రెండు సెషన్లలో పరీక్ష**

జిల్లాలో 97 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 30,315 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. సూర్యాపేటలో 42, కోదాడలో 23, చివ్వెంల 1, ఆత్మకూరు 1, నూతనకల్ 2, పెన్‌పహాడ్ 1, గరిడేపల్లి 1, నేరేడుచర్లలో 5, చిలుకూరులో 3, హుజూర్‌నగర్‌లో 7, మునగాలలో 1, నడిగూడెంలో 1, అనంతగిరి 1, చిలుకూరులో 1, తిరుమలగిరి 2, తుంగతుర్తిలో 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను 22 రూట్లుగా విభజించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల30 నిమిషాల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష ఉండనుంది.

**వీటికి అనుమతి లేదు**

అభ్యర్థులు షూ ధరించి రాకూడదని, సెల్‌ఫోన్, గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, రిమోట్ సెన్సార్‌తో కూడిన కారు కీస్, నిషేధిత, విలువైన వస్తువులు, ఆభరణాలకు అనుమతి లేదు. చెప్పులతో మాత్రమే పరీక్షకు హాజరుకావాల్సి ఉంది.

**గుర్తింపు కార్డు తప్పనిసరి**

అభ్యర్థులు అధికారులకు హాల్‌టికెట్‌తో పాటు ఒరిజినల్ గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుంది. కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, పక్కన ఎస్పీ రాజేంద్రప్రసాద్



సమావేశానికి హాజరైన అధికారులు

- ఇన్‌చార్జ్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. హైస్కూల్, ఇంటర్ చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పేరెంట్స్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అటవీ, వ్యవసాయ శాఖ అధికారులు మారుమూల గ్రామాల్లో పంటలను అటవీ ప్రాంతాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. యువత మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తనను, రోజువారీ కార్యక్రమాలను నిశితంగా పరిశీలించాలన్నారు. హైస్కూల్, కాలేజీల చుట్టుపక్కల సిగరెట్ దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంఈఓలకు సూచించారు. సమావేశంలో వ్యవసాయ అధికారి రామారావు నాయక్, డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, డీఎస్పీ నాగభూషణం, డీఈఓ అశోక్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వాహనాలను తనిఖీ చేయాలి**

మాదక ద్రవ్యాల వినియోగంతో క్రైమ్ పెరిగే అవకాశం ఉందని ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. జిల్లాలోని అన్ని చెక్‌పోస్టుల్లో ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేయాలన్నారు. ఇతర జిల్లాలకు సూర్యాపేట బార్డర్‌లో ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా కావడానికి ఎక్కువ అవకాశం ఉందని, పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో నేరేడుచర్ల, హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాల పోలీసు, అటవీ, ఎక్సైజ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## అందినకాడికి దండుకున్నాడు!

- కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్ అధికారి నిర్వాకం
- బదిలీపై వెళ్తూ ఆఫీస్‌లోని ఏసీని తీసుకెళ్లిన వైనం
- ముందస్తుగా మూడు నెలల మామూళ్ల వసూలు..?
- హత్యాయత్నం కేసు నిందితుడి నుంచి భారీగానే ముడుపులు
- కేసు వివరాలు చెప్పకుండా ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకున్న సదరు అధికారి



కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏసీ తీసుకుపోయిన గుర్తులు

కోదాడ: కోదాడ పట్టణ పోలీస్‌స్టేషన్ అధికారిగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఓ అధికారి నిర్వాకం ఇప్పుడు కోదాడలో చర్చనీయాంశమైంది. కోదాడ నియోజకవర్గంలో దాదాపు రెండున్నరేళ్లు పనిచేసిన ఆయన మూడు నెలల క్రితమే కోదాడ పట్టణ స్టేషన్ అధికారిగా వచ్చారు. వచ్చిన రోజు నుంచి వసూళ్లకు తెరలేపిన ఆయన అందినకాడికి దండుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం బదిలీ కావడం ఖాయమని తెలుసుకున్న సదరు అధికారి రెచ్చిపోయారని సొంత డిపార్టుమెంట్‌వారే అంటున్నారు.

**సుపారీ నిందితుడి నుంచి భారీగా వసూళ్లు..**

కోదాడకు చెందిన ఓ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ హత్యకు రూ.50లక్షల సుపారీ ఇచ్చిన కేసులో నిందితుడైన మరో కళాశాల నిర్వాహకుడిని రిమాండ్ నుంచి తప్పించడానికి సదరు అధికారి భారీ మొత్తంలో వసూళ్లు చేసినట్లు డిపార్టు విచారణలో తేలినట్లు సమాచారం. అదేరోజు ఆయనకు బదిలీ ఉత్తర్వులు రావడంతో జిల్లా ఎస్పీ చెప్పినా వినకుండా తన ఇష్టానుసారంగా వ్యవహరించడంతో పాటు అంత ముఖ్యమైన కేసు వివరాలను వెల్లడించకుండా ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకొని కనిపించకుండా పోవడం వెనుక రూ.లక్షలు చేతులు మారాయని పోలీస్ సిబ్బందే అంటున్నారు. సదరు నిందితుడు రిమాండ్ సమయంలో గుండెపోటు వచ్చినట్లు నటించడం ఆయనను వైద్యశాలకు తరలించడం, అక్కడ నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లడానికి సహకరించిన సదరు అధికారి రూ.లక్షల్లో దండుకొని చెక్కేశాడని అంటున్నారు.

**సీఐ రూంలో ఏసీ తీసుకెళ్లాడు..**

పట్టణ పోలీస్‌స్టేషన్‌లోని సీఐ కార్యాలయంలో పోలీసులతో అంటకాగే కొందరు రూ.40 వేల విలువ చేసే ఏసీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే వారం రోజుల క్రితం బదిలీ అయిన స్టేషన్ అధికారి ఇక్కడి నుంచి వెళ్తూ ఏసీని తీసుకెళ్లారు. ఎన్నికల నిబంధనల ప్రకారం బదిలీ తప్పదని తెలుసుకున్న సదరు అధికారి స్టేషన్‌కు వచ్చే నెలవారీ మామూళ్లను కూడా అవసరం ఉందని మూడు నెలల అడ్వాన్స్‌గా వసూలు చేసుకొని పోయినట్లు విశ్వసనీయ సమాచారం.

**కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారా...?**

కోదాడలో సంచలనం కలిగించిన సుపారీ హత్య కేసులో నిందితుడిగా ఉన్న మరో కళాశాల నిర్వాహకుడు రిమాండ్ సమయంలో గుండెనొప్పి వచ్చిందని చెప్పడంతో న్యాయమూర్తి వైద్యశాలకు పంపించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు గాంధీ వైద్యశాలకు న్యాయమూర్తి పంపించారు. కానీ బదిలీపై వెళ్లిన అధికారి అతన్ని గాంధీ వైద్యశాలకు కాకుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వైద్యశాలకు తరలించి, న్యాయమూర్తికి మాత్రం గాంధీ వైద్యశాలకు తరలించినట్లు తప్పుడు నివేదిక ఇచ్చినట్లు సమాచారం. సదరు నిందితుడు యాంటీస్పేటరీ బెయిల్ తెచ్చుకొనే వరకు ఇలా గుండెనొప్పి నాటకానికి సదరు అధికారే సూత్రధారిగా వ్యవహరించారని సమాచారం.

## యాదాద్రిలో గోవింద్రాయి స్వామిజీ పూజలు


యాదాద్రిలో గోవింద్రాయి స్వామిజీకి ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనర సింహస్వామి వారిని గుజరాత్ రాష్ట్రానికి చెందిన గోవింద్రాయి స్వామిజీ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధా నాలయంలో గర్భాల యంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారు లు లడ్డూ ప్రసాదం అందజేశారు.



# పేదల వైద్యుడు .. రంగన్న!

- 20 రూపాయల నామమాత్రపు ఫీజుతో వైద్యం
- నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తూ గుర్తింపు


సూర్యాపేటలోని తన క్లినిక్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కొప్పుల రంగారెడ్డి

భానుపురి (సూర్యాపేట) : తాను నాడిపట్టాడంటే ఎంతటి విషజ్వరమైనా ఇట్టే తగ్గిపోవాల్సిందే. స్టెత స్కోప్ పెట్టి గుండెచప్పుడు విన్నాడంటే 105 డిగ్రీల జ్వరమైనా చల్లగా జారిపోవాల్సిందే. ఇక ఒంట్లో నలతగా ఉంటే రంగన్న ఆస్పత్రికి వెళ్లొస్తే చాలు.. అదే తగ్గిపోతుందన్న విశ్వాసాన్ని కల్పిం చాడు.. డాక్టర్ రంగారెడ్డి. ఒకటి కాదు రెండు కాదు దాదాపు 40ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవ లందిస్తున్నాడు. ధనార్జనే ధ్యేయంగా వైద్య వృత్తిని కొనసాగిస్తున్న ఈ రోజుల్లోనూ పేదలకు వైద్యం చేయడం సామాజిక బాధ్యతగా భావించి రూ.20లకే వైద్యం చేస్తున్నాడు ఈ పేదల వైద్యుడు రంగన్న. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం సంద ర్భంగా పేదలకు అండగా.. నేటితరం వైద్యులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

**పేదల కష్టాలకు చలించి..**

ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రానికి చెందిన కొప్పుల రంగారెడ్డిది మధ్య తరగతి రైతు కుటుం బం. లింగారెడ్డి, మంగమ్మల ఆరుగురి సంతానం లో రంగారెడ్డి ఒకరు. ప్రాథమిక, ఉన్నత విద్యను స్థానికంగా పూర్తి చేశారు. ఇదే సమయంలో గ్రామంలో ఉండే ప్రజల కష్టాలను చాలా దగ్గరగా చూశారు. చేతిలో చిల్లిగవ్వ లేక ఓ వైపు ఆకలితో.. మరోవైపు అనారోగ్యాలతో జీవనం సాగిస్తున్న ఎన్నో కుటుంబాల కష్టాలకు చలించిపోయేవారు. చిన్నతనం నుంచే అభ్యుదయ భావాలున్న రం గారెడ్డి గ్రామ ప్రజల ఆర్థిక కష్టాలకు అక్షరజ్ఞానం చాలావరకు పరిష్కారం చూపుతుందన్న భావనతో స్నేహితులతో కలిసి దాదాపు 300మందికి రాత్రి బడి చెప్పారు. పీయూసీ, బీఎస్సీ ఖమ్మంలో పూర్తి చేశాక.. గ్రామంలో గత్తరతో నిరుపేదలు చనిపోవ డాన్ని చూసి చలించిపోయారు. డబ్బులు లేకపోవ డంతోనే ఇలా జరిగిందన్న ఆలోచన మనసులో పడడంతో వైద్య వృత్తిని ఎంచుకున్నారు. ఈ క్రమంలో 1973లో గాంధీ మెడికల్ కళాశాలలో చేరారు.

**నేల రుణం తీర్చుకోవాలని..**

వైద్య విద్య పూర్తయ్యాక ఏడాదిన్నర పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో డాక్టర్ రం గారెడ్డి సేవలందించారు. ఈ సేవల్లో తృప్తి లేకపోవడంతో తాను ఏదైతే ఆశయంతో ఈ వృత్తిలోకి వచ్చారో దాన్ని సాధ్యం చేసుకునేం దుకు గాను సూర్యాపేటలో 1983లో పీపుల్స్ నర్సింగ్‌హోమ్ పేరుతో దవాఖానను స్థాపిం చారు. ఈ సమయంలో జనరల్ సేవలతో పాటు గైనకాలజిస్టు తదితర వైద్య సేవలను అందించి సూర్యాపేట తాలుకాలోనే రెండో అతిపెద్ద ఆస్పత్రిగా గుర్తింపు పొందారు. ఈ ఆస్పత్రి ప్రారంభంలో రోగుల నుంచి రూ.3ల ఫీజు తీసుకునే వారు. తదనంతరం రూ.5లు, రూ.7, రూ.8ల చొప్పున ప్రస్తుతం రూ.20ల ఫీజుతో ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఫీజు ఒక్కటే కాకుండా ఆయా రుగ్మతలకు ఇచ్చే మందు లు అవసరమైనవే.. పరిమితంగా తక్కువ ఖర్చుతో నయం అయ్యేలా ఇస్తుంటారు. దీం తో పాతతరానికి చెందిన వారే కాకుండా.. కొత్తతరానికి చెందిన వారు.. చిన్న పిల్లలను సైతం రంగన్న ఆస్పత్రికి తీసుకొస్తుంటారు. ఇలా సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలకు రూ.20ల వైద్యుడిగా రంగారెడ్డి ఎం తో సుపరిచితం.

**ఎప్పుడైనా ఇక్కడికే వస్తాం**



నా భార్యకు రెండురోజులుగా జ్వరం వస్తోందని రంగారెడ్డి ఆస్పత్రికి వచ్చాం. ఇప్పుడే కాదు ఇప్పుడైనా ఈ ఆస్పత్రికి వస్తాం. రంగారెడ్డి డాక్టర్ వద్దకు పోయి వస్తే జ్వరం అదే తగ్గు తోంది. ఫీజు కేవలం రూ.20లే తీసుకుంటారు. మాలాం టి పేదలకు ఎంతో సేవ చేస్తున్నారు.

– ధరావత్ నాగు, జగన్‌తండా, చివ్వెంల మండలం

**సామాజిక బాధ్యతగా గుర్తించాలి**

వైద్యం కోసం సూర్యాపేట, తుంగతుర్తి ప్రాంతాల నుంచి చాలా పేదలు, గిరిజనులే ఎక్కు వగా వస్తుంటారు. చిన్నతనం నుంచి ఆర్థిక ఇబ్బందులు పడ్డ కుటుంబాలను చూసి పెరిగాను. రోగమొస్తే ఆసుపత్రుల్లో డబ్బులు పోయలేక తనువులు చాలించిన కుటుం బాలను సైతం చూశాను. అందుకే నన్ను కన్ననేలకు సేవ చేయాలని.. అది కూడా తక్కువ ఫీజులో వైద్యమందించాలని నిర్ణయించుకున్నా. ఆర్థిక పరిస్థితిని బట్టి కొందరికి ఉచితంగా చూస్తాను. మందులు కూడా అవసరమైనవే రాస్తాను. ప్రతి ఒక్కరూ సేవతత్వాన్ని కలిగి ఉండాలి. వైద్యం సామాజిక బాధ్యతగా గుర్తించాలి.

– కొప్పుల రంగారెడ్డి, వైద్యుడు

## చిట్యాలలో కేటీఆర్‌కు నాయకుల స్వాగతం



చిట్యాల: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శుక్రవారం మహ బూబాబాద్‌లో పోడు పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరై తిరుగి హైద రాబాద్‌కు వెళ్తూ చిట్యాలలో కొద్దిసేపు ఆగారు. కేటీఆర్‌కు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ నాయకు లు, కార్యకర్తలు.. సీఎం సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేటీ ఆర్‌కు స్వాగతం పలికిన వారిలో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున్‌రెడ్డి, నార్కట్‌పల్లి, రామన్నపేట ఎంపీపీలు సూదిరెడ్డి నరేం దర్‌రెడ్డి, కన్నెబోయిన జ్యోతి, బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, నాయకులు వనమా వెం కటేశ్వర్లు, జనగాం నర్సింహగౌడ్, గుండెబోయిన సైదులు, బెల్లి సత్తయ్య, అర్రూరి శ్రీశైలం, బొక్కా మాధవరెడ్డి ఉన్నారు.

## 'పేట' కోర్టుకు హాజరైన మంత్రి జగదీష్‌రెడ్డి


న్యాయవాదులతో మాట్లాడుతున్న మంత్రి

చివ్వెంల(సూర్యాపేట) : కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ 2018లో జరిగిన సాధారణ ఎన్నికల్లో తనపై అసత్య ఆరోపణలు చేశారని పేర్కొంటూ విద్యుత్ శాఖ మంత్రి గుం టకండ్ల జగదీష్ రెడ్డి పరువు నష్టం దావా వేశారు. వాయిదా నేపథ్యంలో శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణం లోని రెండవ ఆదనపు న్యాయమూర్తి కోర్టుకు మంత్రి హాజరయ్యారు. కేసులో ముద్దాయిగా ఉన్న పొన్నం ప్రభాకర్ హాజరు కాకపోవడంతో కేసును జూలై 28కి వాయిదా వేశారు. అనంతరం మంత్రి జగదీష్‌రెడ్డి బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదులతో కొద్దిసేపు మాట్లాడి వెళ్లిపోయారు.

## తుంగతుర్తి నుంచి పోటీ చేస్తా

- పిడమర్తి రవి


తుంగతుర్తిలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

తుంగతుర్తి : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయ డానికి సిద్ధంగా ఉన్నా నని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి తెలిపారు. శుక్రవారం ఆయన తుంగతుర్తి మండల కేంద్రంలో విలేకరుల తో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు విద్యార్థి ఉద్యమ నాయకుడిగా సీఎం కేసీఆర్‌తో సమానంగా పోరాటం చేశానని, రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించానని పేర్కొన్నారు. జూలై–2న ఖమ్మంలో జరిగే బహిరంగ సభ లో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. తుంగతుర్తి నుంచి తాను పోటీ చేస్తే విజయం సాధించడం ఖాయమన్నారు. ఆయనతో పాటు జిల్లా యువ జన కాంగ్రెస్ కార్యదర్శి మహేందర్, ఇమ్మడి సుధాకర్, అనిల్, రాంబాబు, సైదులు, మల్లేష్, పరుశరాములు తదితరులు ఉన్నారు.

## నిరంకుశ విధానాలపై ఉద్యమించాలి


జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్

భువనగిరిటౌన్ : పాలకుల నిరంకుశ విధానాలపై యువత ఉద్యమించాలి ప్రజాసంఘాల ఐక్య వేదిక కన్వీనర్ బట్టు రామ చంద్రయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరు సాగర్ పిలుపునిచ్చారు. శుక్రవారం భువన గిరిలోని బాబు జగ్జీవన్‌రావు భవన్‌లో జరిగిన ప్రగతిశీల యువజన సంఘం జిల్లా మహాసభలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య చాలా తీవ్రంగా ఉందన్నారు. యువత శక్తిని ఉపయోగించుకునేందుకు ప్రభు త్వాలు కృషి చేయాలన్నారు. ఉపాధి అవకాశాలను కోల్పోయిన యువత వివిధ రకాల మత్తు వ్యసనాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత అమరవీరుల వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని సమసమాజ స్థాపన కోసం పోరాడాల్సిన అవ సరం ఉందన్నారు. అంతకు ముదు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు సాదుల శ్రీకాం త్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టగా సభ్యులు ఆమోదించారు. జిల్లా ఉపాధ్యక్షులు గుండు నరేంద్రబాబు, నాయకులు షకీలా వెంకటేష్, దడిగే కృష్ణ, పురుమ భాస్కర్, అంగిడి వెంకటేష్, మహంకాళి సిద్ధులు, ఆర్ ఉదయ్, సుంచు భాను, బీబీ నగరం బాబు, కడకంచి మధు, నర్మెట భరత్, బండి ప్రశాంత్, నోముల ప్రవీణ్, సుంచు ఆంజనేయులు, బాల చంద్రమౌళి, చింతపండు ప్రసాద్, నమిల ఎల్లయ్య, గ్యార మాతయ్య పాల్గొన్నారు.

## విక్రయించిన ధాన్యానికి రశీదులు ఇవ్వడం లేదని..

- మర్రిగూడ చౌరస్తాలో రైతుల ధర్నా
- పీఏసీఎస్ ఫర్నిచర్ ధ్వంసం


చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న రైతులు

మర్రిగూడ : విక్రయిం చిన ధాన్యానికి రశీదు లు ఇవ్వడం లేదని రైతులు శుక్రవారం పీఏసీఎస్ ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. అనం తరం మర్రిగూడ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో 629 మం ది రైతుల నుంచి 31.46టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. విక్రయించిన ప్రతి ధాన్యపు బస్తా రశీదులు, చెల్లిస్తున్న ప్రతి బిల్లు వివరాలు అందించాలని డిమాండ్ చేశారు. ఆ తరువాత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి స్థానిక ఎస్ఐ రంగారెడ్డి చేరుకుని సోమవారం లోపు రైతులకు రశీదులు అందచేయించేలా చర్యలు చేపడ్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. కార్యక్రమంలో రాజేందర్, యాదయ్య, కృష్ణయ్య, నర్సింహ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో పురుగులున్నాయని విద్యార్థుల ధర్నా


పెద్దకాపర్తిలో రహదారిపై ధర్నా చేస్తున్న జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

చిట్యాల: మధ్యాహ్న భోజనంలో పురుగు లున్నాయని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రోడ్డెక్కారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలోని జెడ్పీహె చ్ఎస్‌లో కొద్ది రోజులుగా మధ్యాహ్న భోజనం సరిగా వండటం లేదని, భోజనంలో పురుగులున్నాయని ఆరోపిస్తూ ఆ పాఠశాల విద్యార్థులు శుక్రవారం భోజనం చేయకుండా పాఠశాల ముందున్న రోడ్డు మీదకు వచ్చి ధర్నా నిర్వహించారు. దీంతో సమాచారం అందుకున్న చిట్యాల తహసీల్దార్ జక్కర్తి శ్రీనువాసులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడి సమ స్యలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో విద్యార్థులు ధర్నా విరమిం చారు. పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యంతోనే వంటలు చేస్తు న్నట్లు, తాను రోజూ మధ్యాహ్న భోజనం పరిశీలించిన తర్వాతనే విద్యార్థులకు వడ్డిస్తున్నట్లు హెచ్ఎం రామలింగాచారి తెలిపారు.

## 'మన బడి' పనులు త్వరగా పూర్తి చేయాలి

మోతె: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు – మన బడిలో భాగం గా చేపట్టిన తరగతి గదులు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని డీఈఓ అశోక్ అన్నారు. శుక్రవారం మోతె మండల పరిధిలోని నామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బుర్కచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన సందర్శిం చారు. నాబార్డు నిధులతో నిర్మిస్తున్న పాఠశాల తరగతి గదుల నిర్మాణ పను లు పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ గోపాల్‌రావు, ప్రధానోపాధ్యాయు లు, ఉపాధ్యాయులు, నాబార్డు టీం సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు.

**'మన ఊరు– మన బడి' పనుల పరిశీలన**

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండల పరిధిలోని గుంజలూరు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన మన ఊరు– మన బడి పనులను డీఈఓ అశోక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పను లు త్వరితగతిన పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలని సూచిం చారు. అనంతరం పాఠశాలలో మధాహ్న భోజనం పరిశీలించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## 'బీజేపీలో సరైన గుర్తింపు లేకనే రాజీనామా'

సూర్యాపేట: బీజేపీ జెండా పట్టి తొమ్మిదేళ్లు అవుతున్నా పార్టీలో సరైన గుర్తిం పు లేదని, అందుకే ఆ పార్టీకి రాజీనామా చేశానని, త్వరలో మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వల్దాస్ ఉపేందర్ తెలిపారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని ఎస్ఆర్ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బలుగురు రాజు, లక్ష్మ ణ్‌లతో కలిసి బీజేపీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిం చి మాట్లాడారు. బీజేపీలో దళితులకు సరైన గుర్తింపు లేదని ఆరోపించారు. నియోజకవర్గంలో గతంలో ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధిని మంత్రి జగదీశ్‌రెడ్డి చేసి చూపిస్తున్నారని తెలిపారు. సూర్యాపేట ప్రజలు మంత్రి జగదీశ్‌రెడ్డిని మూడోసారి గెలిపించుకుంటే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. సమావే శంలో బీజేపీకి రాజీనామా చేసిన క్రిస్టియన్ మైనార్టీ నాయకులు బలుగూరి రాజు, ఓబీసీ మోర్చా పట్టణ కార్యదర్శి సోమగాని లక్ష్మణ్, మహేందర్, మహే ష్ తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనర సింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఊంజలి సేవ ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆండాళ్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిం చి ఆలయ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో ఊం జలి సేవ జరిపించారు. మహిళలు మంగళ హారతులతో సేవకు స్వాగతం పలికారు.

**సవరణ**

ది. 23.06.2023 సాక్షి దినపత్రిక సూర్యాపేట జిల్లాలో ప్రచురితమైన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ... బ్రాంచ్ వారి ప్రకటనలో ... [illegible]

**సవరణ**

ది. 23.06.2023 సాక్షి దినపత్రిక సూర్యాపేట జిల్లాలో ప్రచురితమైన ... [illegible]